
సాక్షి తిరుపతి

సోమవారం । 16 । అక్టోబర్ । 2023



కోలాహలం.. జెండా ఉత్సవం

గూడూరు పట్టణంలో మహాలయ అమావాస్య సందర్భంగా ఆదివారం జెండా మహోత్సవాన్ని నిర్వహించారు.

- 8లో



వెంకటగిరికి జాతీయ ఖ్యాతి

వన్ డిస్ట్రిక్ట్ - వన్ ప్రొడక్ట్ పేరుతో కేంద్ర ప్రభుత్వం అందించనున్న అవార్డుల రేసులో వెంకటగిరి చేనేత చేరింది.

- 8లో

	గరిష్ఠం	కనిష్ఠం
తిరుపతి	34	23
చిత్తూరు	32	22
తిరుమల	28	18
గూడూరు	35	25
నగరి	33	23

న్యూస్‌రీల్

యజ్ఞ స్థల పరిశీలన



యజ్ఞ స్థలాన్ని పరిశీలిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, అధికారులు

తిరుపతి కల్చరల్: అలిపిరి వద్దనున్న సప్తగోప్రదక్షిణ మందిరం ప్రాంగణంలో శ్రీశ్రీనివాస దివ్యానుగ్రహ విశేష యజ్ఞం నిర్వహణ కోసం టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఆదివారం స్థలాన్ని పరిశీలించారు. ప్రపంచ వ్యాప్తంగానున్న హిందువులు తమ శుభకార్యాలు, విశేషమైన రోజుల్లో స్వామివారి అనుగ్రహం కోసం సంకల్పం చెప్పుకుని యజ్ఞం నిర్వహించుకునేలా టీటీడీ ధర్మకర్తల మండలి ఇటీవల నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి సప్తగోప్రదక్షిణ మందిరం వద్దనున్న స్థలాన్ని పరిశీలించారు. వీలైనంత త్వరగా యజ్ఞ నిర్వహణకు అవసరమైన నిర్మాణాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ చెన్నై స్థానిక సలహా మండలి చైర్మన్ శేఖర్‌రెడ్డి, టీటీడీ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 5 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. శనివారం అర్ధరాత్రి వరకు 67,785 మంది స్వామివారిని దర్శించుకోగా 21,284 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. కానుకల రూపంలో హుండీలో రూ.2.78 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా, దర్శన టికెట్లు లేని భక్తులకు 5 గంటల్లో, టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

తొలి ప్రయాణికులకు సంప్రదాయ దుస్తులు



ప్రయాణికులకు చీర, పంచెను అందిస్తున్న డీపీటీవో చెంగల్‌రెడ్డి

తిరుపతి అర్బన్: తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల ప్రారంభమైన ఆదివారం తెల్లవారుజామున బస్సు ఎక్కిన తొలి ప్రయాణికుల దంపతులకు సంప్రదాయ దుస్తులైన చీర, పంచెను ఆర్టీసీ అధికారులు పంపిణీ చేశారు. ఏళ్ల తరబడి వస్తున్న సంప్రదాయాన్ని యథావిధిగా కొనసాగించారు. తిరుపతి ఏడుకొండల బస్టాండ్, అలిపిరి బాలాజీ బస్టాండ్, రైల్వే స్టేషన్ వద్ద పంపిణీ దుస్తులను చేశారు. ముందుగా ఆర్టీసీ బస్సును ముస్తాబు చేసి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డితోపాటు డెప్యూటీ సీటీఎం భాస్కర్, అలిపిరి డీఎం హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

టెలిస్కోప్ తయారీపై వర్క్‌షాప్



వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న అతిథులు

తిరుపతి కల్చరల్: భారతరత్న డాక్టర్ ఏపీజే.అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని రీజనల్ సైన్స్ సెంటర్‌లో ఆదివారం పాఠశాలల విద్యార్థులకు ఖగోళ టెలిస్కోప్ తయారీపై వర్క్‌షాప్ నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా తుడా కార్యదర్శి ఎస్.లక్ష్మి, అమరరాజా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ డీన్ కేవీ.రవికుమార్ హాజరై వర్క్‌షాపును ప్రారంభించారు. వారు టెలిస్కోప్ వర్క్‌షాపు ప్రాముఖ్యతను తెలియజేశారు. డూ ఇట్ యువర్ సెల్ఫ్ -ఆన్ యాక్టివిటీ స్కిల్‌కు సంబంధించిన విషయాలను వివరించారు. విద్యార్థులకు టెలిస్కోప్ సంక్షిప్త చరిత్ర, రకాలు, పని సూత్రాలను తెలియజేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి తయారు చేసిన టెలిస్కోప్‌లను వారి పాఠశాలలకు తీసుకెళ్లాలని సూచిస్తూ, వారికే అందజేశారు. ఈ కార్యక్రమంలో సైన్స్ సెంటర్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ కె.శ్రీనివాస నెహ్రూ, సిబ్బంది. వివిధ ప్రభుత్వ, మున్సిపల్ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శేషశైలావాస..!

బంగారు తిరుచ్చిపై శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి



పెద్ద శేష వాహనంపై స్వామివారికి విశేష హారతి





వాహనసేవను తిలకిస్తున్న భక్తులు



తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం ఉదయం తిరుచ్చి వాహనంపై విహరిస్తూ తిరుమల శ్రీవారు భక్తకోటిని అనుగ్రహించారు. రాత్రి ఏడు తలల స్వర్ణ శేష వాహనంపై వైకుంఠనాథుడి అలంకరణలో ఊరేగుతూ కనువిందు చేశారు. వాహన సేవల ముందు వివిధ రాష్ట్రాలకు చెందిన కళాబృందాల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది.

- అంగరంగ వైభవంగా తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు
- పెద్ద శేష వాహనంపై విహరించిన మలయప్ప
- ఆకట్టుకున్న కళాబృందాల ప్రదర్శన

తిరుమల: తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు ఆగమోక్తంగా ఆరంభమయ్యాయి. మొదటి రోజు ఆదివారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామివారు బంగారు తిరుచ్చిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. రాత్రి ఉభయదేవేరులతో కలిసి శ్రీమలయప్ప స్వామివారు ఏడు తలల పెద్ద శేష వాహనంపై వైకుంఠ నాథుడి అలంకరణలో తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ఏవీ.ధర్మారెడ్డి, హైకోర్టు న్యాయమూర్తులు, పలువురు బోర్డు సభ్యులు, జేఈఓ సదాభార్గవి, వీరబ్రహ్మం, సీవీఎస్వో నరసింహకిషోర్ పాల్గొన్నారు.



వాహన సేవలో కళాకారుల ప్రదర్శన



క్షీర సాగర మథనం



పెద్ద శేష వాహన సేవలో పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తులు

నేటి వాహన సేవలు

ఉదయం చిన్న శేషవాహనం

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో 2వ రోజు సోమవారం ఉదయం శ్రీ మలయప్పస్వామివారు ఐదు తలల చిన్నశేష వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు.

రాత్రి హంస వాహనం

సోమవారం రాత్రి శ్రీమలయప్పస్వామివారు వీణాపాణియై హంస వాహనంపై సరస్వతీమూర్తి అవతారంలో దర్శనమిస్తారు.



టీటీడీ ఈవో ధర్మారెడ్డికి పరివట్టాన్ని అలంకరిస్తున్న వేద పండితుడు

వేదాలు మానవాళికి మార్గదర్శకాలు



నాద నీరాజనం వేదికపై మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి

తిరుమల: పవిత్ర గ్రంథాలైన వేదాలు మానవాళి ధర్మబద్ధమైన జీవితాన్ని గడపడానికి మార్గదర్శకాలు అని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి అన్నారు. తిరుమలలోని నాద నీరాజన వేదికపై ఆదివారం వేంకటేశ్వర ఉన్నత వేద అధ్యయన సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీనివాస వేద విద్వత్ సదస్సు ప్రారంభోత్సవానికి టీటీడీ చైర్మన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ, భారతదేశంలో వేల సంవత్సరాల నుంచి వేద విజ్ఞానం పరిఢవిల్లుతోందన్నారు. వేద ప్రామాణికంగా నడుచుకుంటే నైతిక విలువలతో కూడిన జీవనం అలవడుతుందని తెలిపారు. ప్రముఖ వేదపండితులు బ్రహ్మశ్రీ చిర్రావూరి శ్రీరామశర్మ వేదాలు బోధించే 'పంచాదశ సంస్కారాల' ప్రాముఖ్యతను వివరించారు. వేదం అజ్ఞానంలో ఉండే మానవుడిని విజ్ఞానం వైపు నడిపించడంతోపాటు సంస్కారం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీబీసీ సీఈవో షణ్ముఖ కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవి, ఎస్వీ ఉన్నత వేద అధ్యయన సంస్థ ప్రత్యేకాధికారి డాక్టర్ విభీషణ శర్మ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో నేడు స్పందన

తిరుపతి అర్బన్: తిరుపతి కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అన్ని విభాగాల ఉన్నతాధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో అర్జీలను రాయడానికి ప్రత్యేకంగా ముగ్గురు వీఆర్‌ఏలను ఏర్పాటు చేశామని చెప్పారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రతి రోజు సాయంత్రం తప్పనిసరిగా స్పందన వినతులు స్వీకరించాలన్నారు. సమస్యల పరిష్కారానికి చక్కటి వేదికగా ఉన్న స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేవీ ఫోర్స్‌పై అవగాహన అవసరం





కార్యక్రమానికి హాజరైన నేవీ, ఎన్‌సీసీ అధికారులు, క్యాడెట్లు, ఇండియన్ నేవీ లెఫ్టినెంట్ కమాండర్ దీపక్ యాదవ్‌ను జ్ఞాపికతో సత్కరిస్తున్న ఎన్‌సీసీ అధికారి

తిరుపతి సిటీ: ఇండియన్ నేవీ ఫోర్స్‌పై యువత అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని విశాఖపట్నం ఇండియన్ నేవీ లెఫ్టినెంట్ కమాండర్ దీపక్ యాదవ్ పిలుపునిచ్చారు. స్థానిక ఎన్‌సీసీ నగర్‌లో ఆదివారం నిర్వహించిన ఆల్ ఇండియా నేవీ కారు ర్యాలీని ఎన్‌సీసీ అధికారులతో కలసి ఆయన ప్రారంభించి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ టొయోటో కంపెనీ సహకారంతో దేశవ్యాప్తంగా ప్రజలకు, ఎన్‌సీసీ క్యాడెట్లకు, యువతకు నేవీ కేరీర్‌పై అవగాహన కల్పించేందుకు ఆల్ ఇండియా నేవీ కారు ర్యాలీని ఇండియన్ నేవీ ఫోర్స్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. ఈ ర్యాలీ విశాఖపట్నం నుంచి ఈ నెల 12న ప్రారంభించామని, అక్టోబర్ 23 వరకు దేశవ్యాప్తంగా ప్రధాన పట్టణాల నుంచి కన్యాకుమారికి చేరుతుందన్నారు. యువతను ఇండియన్ నేవీ వైపు ప్రోత్సహించడమే ఈ ర్యాలీ ప్రధాన ఉద్దేశమన్నారు. యువతకు ఇండియన్ నేవీలో మంచి ఉద్యోగ అవకాశాలు ఉంటాయిని, తమ కెరీర్‌లో ఉన్నత స్థాయికి ఎదిగి దేశ సేవలో పాలుపంచుకోవాలని కోరారు. నేవీలో ఏఏ క్యాటగిరీలో ఎలాంటి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి, వేతనాల వివరాలు, సదుపాయాలు, దేశ సేవలో నేవీ ఫోర్స్ పాత్ర వంటి విషయాలను ఆయన ఎన్‌సీసీ క్యాడెట్లకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం కారు ర్యాలీని ప్రారంభించారు. ఇండియన్ నేవీ లెఫ్టినెంట్ కమాండర్‌ను ఎన్‌సీసీ అధికారులు జ్ఞాపికతో సత్కరించారు.

పెద్దశేషుడిపై కల్యాణ వెంకన్న

- తుమ్మలగుంటలో నవరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పెద్ద శేష వాహన సేవలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

తిరుపతి రూరల్: తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి నవరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో మొదటి రోజు ఆదివారం రాత్రి పరమపద వైకుంఠనాథుడి అలంకరణలో కల్యాణ వెంకన్న శ్రీదేవి, భూదేవి సమేతంగా పెద్ద శేష వాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. బ్రహ్మోత్సవాల్లో శ్రీవారు స్వయంగా పాల్గొనే మొదటి ఉత్సవం పెద్దశేష వాహనం. ఏడు కొండలకు, ఏడు లోకాలకు సంకేతంగా ఏడు పడగలు కలిగిన ఆది శేషుడు శ్రీవారికి వాహనమై నిత్యం స్తుతిస్తూ, స్వామికి మంచం, పరుపు, ఛత్రంగా మారడంతో శ్రీవారిని శేషశాయి అని కూడా పిలుస్తారు. భక్తులందరూ ఆదిశేషునిలా స్వామికి నిత్య సేవకులుగా ఉంటే సత్ఫలితాలు సాధ్యమని భక్తుల నమ్మకం. ఈ బ్రహ్మోత్సవా ల నిర్వహణకు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కంకణధారణ గావించారు. ఉత్సవంలో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు, ఈవో నల్లందుల సుబ్బరామిరెడ్డి, కంకణ భట్టార్ గిరిధర్ భట్ట ఆచార్యులు, వేద పండితులు ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వెంకన్నకు సారె సమర్పణ

నవరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా తుమ్మలగుంట గ్రామస్తులు చీర, సారె తీసుకురావడంతో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఎదురెళ్లి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. భక్తులు తీసుకొచ్చిన సారెను స్వామికి సమర్పించారు.

ఆకట్టుకున్న కేరళ వాయిద్యాలు

శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో కేరళ వాయిద్యాలు, చెక్క భజనలు, పిల్లనగ్రోవి కళాకారుల నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.



విశేష అలంకరణలో తుమ్మలగుంట కల్యాణ వెంకన్న ఆలయం



బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి కంకణధారణ చేస్తున్న అర్చకులు

క్లుప్తంగా

హక్కుల పరిరక్షణకు కృషి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

తిరుపతి సిటీ : మానవ హక్కుల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తున్నట్లు నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జాతీయ అధ్యక్షులు డిఆర్ సంపత్ కుమార్ పేర్కొన్నారు. ఎస్వీ యూనివర్సిటీ సెనేట్ హాల్లో ఆదివారం నిర్వహించిన హ్యూమన్ రైట్స్ రాష్ట్రస్థాయి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మానవ హక్కుల విషయంలో ప్రజలకు అండగా నిలుస్తున్నామన్నారు. హ్యూమన్ రైట్స్ జాతీయస్థాయిలో విస్తృతంగా పనిచేస్తోందని, హక్కులకు ఎక్కడ భంగం కలిగినా తమ కమిటీ అక్కడ సంపూర్ణ మద్దతు ఇస్తూ అండగా నిలబడుతోందన్నారు. సమావేశంలో హైకోర్టు సీనియర్ అడ్వకేట్ బుల్లెట్ రవి, రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెంగమేష్ చౌదరి, అధ్యక్షులు లక్ష్మీకాంత్, బాబూజీ, మీడియా సెక్రటరీ రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్, చంద్ర, సుమంత్, సురేంద్ర, విక్టోరియా, రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

జాలర్లపై స్పీడ్ బోట్ల దాడి

వాకాడు: మండలంలోని తూపిలిపాళెం సముద్రంలో పొరుగు ప్రాంతాలకు చెందిన స్పీడు బోట్లతో స్థానికి జాలర్లపై దాడులు చేస్తున్నట్లు మత్స్యకారులు వాపోయారు. వారు ఆదివారం మీడియాతో మాట్లాడుతూ, తూపిలిపాళెం వద్ద సముద్రంపై ఇంజిన్ బోట్ల పరిధిని దాటి పొరుగు ప్రాంతాలైన తమిళనాడు, రామేశ్వరం, తూత్తుకుడి, నాగలాపురానికి చెందిన స్పీడు బోట్లు అధిక సంఖ్యలో వేట సాగిస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం స్పీడు బోట్లు తీరం నుంచి 8 నాటికల్ మైళ్ల దూరంలో సముద్రంపై వేట సాగించాల్సి ఉందన్నారు. అయితే వారి పరిధిని దాటి తీరం అంచుకు వచ్చి వేటాడుతున్నారని, స్థానిక మత్స్యకారుల బోట్లపై రాళ్లతో దాడి చేస్తున్నారని చెప్పారు. ఈ విషయమై గతంలో జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేసినట్లు వివరించారు.

వెంకటగిరికి జాతీయ ఖ్యాతి

జరీ చీరలతో మహారాణులనే మురిపించిన వెంకటగిరి చేనేత ఖ్యాతి జాతీయ స్థాయిలో మార్మోగుతోంది. కేంద్ర ప్రభుత్వం అందించే వన్ డిస్ట్రిక్ట్ – వన్ ప్రొడక్ట్ అవార్డు రేసులో మన చేనేత చేరింది. ఈ చేనేత వస్త్రాల పరిశీలనకు కేంద్ర బృందం ఈ నెల 17న వెంకటగిరి పట్టణంలో పర్యటించనుంది. అంతర్జాతీయంగా ప్రసిద్ధిగాంచిన ఇక్కడి నేత చీరలను పరిశీలించి తగిన హోదా ఇవ్వనుంది. ఈ నేపథ్యంలో ఈ వెంకటగిరి చేనేత చరిత్రను, ప్రత్యేకతను తెలుసుకుందాం.

- అవార్డు రేసులో చేనేత వస్త్రాలు
- 17న వెంకటగిరికి ఢిల్లీ బృందం
- వన్ డిస్ట్రిక్ వన్ ప్రొడక్ట్‌కు రాష్ట్రంలో 12 రంగాలు

మగ్గం ద్వారా చీరను నేస్తున్న మహిళ (ఇన్‌సెట్) వెంకటగిరి పట్టు చీరలు



తిరుపతి అర్బన్: రాష్ట్రంలోనే కాకుండా దేశంలోనే ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న వెంకటగిరి వస్త్రాలకు 150 ఏళ్ల చరిత్ర ఉంది. వెండి జరీ, ఆఫ్‌ఫైన్ జరీలను అమర్చి ప్రత్యేక శైలిలో చీరలు నేయడం ద్వారా ఇక్కడి చేనేత పరిశ్రమ జాతీయ స్థాయిలో ప్రసిద్ధి పొందింది. వెంకటగిరి చీరలను 17వ శతాబ్దంలోనే నెల్లూరుకు చెందిన వెలుగుగోటి రాజవంశీయులు ధరించేవారు. చీరకు రెండు వైపులా ఒకే డిజైన్ కనిపించే జాందనీ వర్క్‌తో నేయడంతోపాటు కాటన్ చీరలు చుట్టూ చంగావి రంగు చీరల తయారీకి వెంకటగిరి ప్రసిద్ధి. ఇక్కడ 22 సంఘాలు, 660 మంది సభ్యులు తయారుచేసిన ఉత్పత్తులను బహిరంగ మార్కెట్లో విక్రయిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే చేనేత వస్త్ర ప్రదర్శనల్లో, ఆప్కో వస్త్రాలయాల్లో ఈ చీరలకు మంచి డిమాండ్ ఉంది.



ఐఐహెచ్‌టీలో చేనేత చీరల డిజైనింగ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

చీరల తయారీ విధానం ఇలా

వెంకటగిరి చేనేత కార్మికులు చీరల తయారీలో క్రమపద్ధతి పాటిస్తుంటారు. ప్రధానంగా హాంక్ (చిలప) రూపంలో పత్తి, వెండి, బంగారు జరీలు, నాప్తాల్‌తోపాటు పత్తి శుద్ధీకరణ చేస్తారు. మరోవైపు హాంక్ కాటన్‌ను ఉడకబెట్టి, రాత్రంతా నానబెట్టి, కడిగి, రంగులు అద్దుతారు. అంతేకాకుండా తెల్ల చీరలకు బ్లీచింగ్ టెక్నిక్‌ని వాడడం, మానవ మూలకం, గ్రాఫ్ పేపర్ డిజైన్‌తోపాటు నేసిన వాటిలో లోపాలను సరిచేయడానికి మాస్టర్ వీవర్ ద్వారా తనిఖీ చేపట్టి నాణ్యత ప్రమాణాలు తెలుసుకోవడం వీరి ప్రత్యేకత.

వెంకటగిరికి ఢిల్లీ బృందం

కేంద్ర ప్రభుత్వానికి అనుబంధంగా ఇన్వెస్ట్ ఇండియా కమిటీ పర్యవేక్షణలో చేతివృత్తుల్లో ప్రత్యేక నైపుణ్యత సాధించడంతోపాటు గుర్తింపు పొందిన రంగాలకు ఈ ఏడాది నుంచి జాతీయస్థాయి అవార్డులను ప్రదానం చేయాలని నిర్ణయించింది. ఈ క్రమంలో మన రాష్ట్రం నుంచి 12 రంగాలను ఎంపిక చేశారు. అందులో ముందు వరుసలో వెంకటగిరి చేనేత పరిశ్రమను జాతీయ అవార్డు పోటీలకు ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో ఇన్వెస్ట్ ఇండియా కమిటీ ప్రతినిధి జిగీష తివారీ మిశ్రా నేతృత్వంలో ఓ బృందం ఈనెల 17వ తేదీ (మంగళవారం) వెంకటగిరిలో పర్యటించనుంది. వస్త్రాల నాణ్యతా, ప్రమాణాలపై నివేదిక రూపొందించనుంది.

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ

వెంకటగిరిలో చేనేత కార్మికుల కోసం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీని 1992లో భారత ప్రభుత్వ టెక్స్‌టైల్స్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో స్థాపించారు. ఏపీ హ్యాండ్లూమ్స్ – టెక్స్‌టైల్స్ కమిషనర్ అడ్మినిస్ట్రేటివ్ నియంత్రణలో 25 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన, ఈ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులకు అనేక రకాల కోర్సులు అందిస్తూ, ఉపాధి ఉద్యోగాల కల్పనలో ముందుంది. దీన్ని నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి వెంకటగిరి శాసనసభ్యుడుగా ఎంపికై రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఏర్పాటు చేశారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ ద్వారా చేనేత కార్మికులు మరింత నైపుణ్యాన్ని సంపాదించుకోవడంతో పాటు వారు తయారు చేస్తున్న చేనేత వస్త్రాలకు ఏఏ రాష్ట్రాల్లో, డిమాండ్ ఉందో గుర్తించి, ఆయా ప్రాంతాలకు పంపడానికి ఇది ఎంతో సౌకర్యంగా ఉంటుంది.



బంగారు, వెండి జరీ డిజైన్లు



ఇండియాలోనే ప్రసిద్ధి చెందిన ఐఐహెచ్‌టీ

జాతీయ అవార్డు ఆశిద్దాం



వెంకటగిరిలోని చేనేత ఉత్పత్తులు చీరలు, చేనేతల అభివృద్ధిని పరిశీలించేందుకు ఇన్వెస్ట్ ఇండియా కమిటీ ప్రతినిధి జిగీష తివారి మిశ్రా బృందం మంగళవారం వస్తోంది. వన్ డిస్ట్రిక్ట్ – వన్ ప్రొడక్ట్‌లో భాగంగా కమిటీ చేనేత వస్త్రాల నాణ్యతా ప్రమాణాలు, ప్రత్యేకతలపై తనిఖీలు చేపట్టనుంది. అంతేకాకుండా కార్మికుల ప్రోత్సాహానికి ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని తెలుసుకోనుంది. కార్మికులతో ముఖాముఖి చర్చించనుంది. ఈ జాతీయ అవార్డు వెంకటగిరి చేనేతకు దక్కాలని ఆశిద్దాం.

–కే.వెంకటరమణారెడ్డి, కలెక్టర్, తిరుపతి జిల్లా

నేతన్నకు అండగా ప్రభుత్వం



వెంకటగిరి చేనేత ఉత్పత్తులు వన్ డిస్ట్రిక్ వన్ ప్రొడక్ట్ 2023 పోటీకి ఎంపిక చేయడం హర్షణీయం. వెంకటగిరి చేనేత కార్మికుల ఉత్పత్తులకు దేశవిదేశాల్లోనూ మంచి డిమాండ్ ఉంది. అందుకు తగినట్లుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నేతన్న నేస్తం పేరుతో ప్రోత్సాహం అందిస్తూ కార్మికులకు అండగా నిలుస్తోంది. దీంతో కార్మికులు మరింత ఉత్సాహంతో ముందుకు సాగుతున్నారు. వెంకటగిరి చేనేత ఉత్పత్తులకు జాతీయ అవార్డు రావాలని కోరుకుంటున్నాం.

–నక్కా వెంకటేశ్వరరావు, డైరెక్టర్, పద్మశాలి కార్పొరేషన్

ప్రభుత్వ ప్రోత్సాహం మెండుగా ఉంది



వెంకటగిరి చేనేత కార్మికులకు ప్రభుత్వం సాయం మెండుగా ఉంది. నేతన్న నేస్తంతో పాటు ప్రభుత్వం కార్మికులకు అవసరమైన అన్ని సదుపాయాలను కల్పిస్తోంది. ప్రధానంగా అర్హులందరికీ సిఫార్సు లేకుండా పథకాలను అందజేస్తోంది. నిజమైన చేనేత కార్మికులకు ప్రభుత్వం అండగా నిలబడింది. దానికి తగినట్లుగా నేత కార్మికులు మరింత ఉత్సాహంగా చీరలునేస్తున్నారు. వెంకటగిరికి వస్తున్న ఢిల్లీ బృందానికి ఇక్కడి ప్రత్యేకతలను, ప్రభుత్వ ప్రోత్సాహాన్ని వివరంగా చెబుతాం.

–ఎస్.విజయకుమార్, చేనేత కార్మికుడు, వెంకటగిరి

నిశిత పరిశీలన



వెంకటగిరి చేనేత వస్త్రాలను నిశితంగా పరిశీలించడానికి ఢిల్లీ బృందం మంగళవారం రానుంది. అన్ని అంశాలను వారు నిశితంగా పరిశీలించి, నివేదికను అందిస్తారు. వెంటగిరి చేనేత ఉత్పత్తులతోపాటు రాష్ట్రంలో 12 రంగాలను ఎంపిక చేశారు. బృందం కార్మికులతోనూ నేరుగా మాట్లాడుతుంది. ఆ మేరకు పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాం. కార్మికులందరూ కమిటీకి పూర్తి సహకారం అందించాలని కోరుతున్నాం.

–బీపీ రావు, అసిస్టెంట్ డైరెక్టర్, హ్యాండ్‌లూమ్ టెక్స్‌టైల్స్, తిరుపతి జిల్లా

అభివృద్ధిలో భూమనకే మా మద్దతు

- టీటీడీ ఉద్యోగ సంఘాల నాయకుల స్పష్టీకరణ

తిరుపతి మంగళం : తిరుపతిని ఎన్నడూ లేనంతగా అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డికే తమ మద్దతు ఉంటుందని టీటీడీ ఉద్యోగ సంఘాల నేతలు స్పష్టం చేశారు. టీటీడీ ఉద్యోగ సంఘాలు, అనుబంధ సంస్థల నాయకులు ఆదివారం పద్మావతిపురంలోని ఎమ్మెల్యే నివాసంలో కరుణాకరరెడ్డిని కలిసి సత్కరించారు. తిరుపతి అభివృద్ధిలో ఎమ్మెల్యే భూమన నిర్ణయాలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఏకకంఠంతో ప్రకటించారు. వారు మాట్లాడుతూ, టీటీడీ నుంచి ఒక శాతం నిధులను తిరుపతి అభివృద్ధికి కేటాయిస్తూ టీటీడీ చైర్మన్, ఈవో తీసుకున్న నిర్ణయం హర్షించదగ్గ విషయమన్నారు. తిరుపతిలో సుమారు లక్ష మంది టీటీడీ ఉద్యోగులు, కార్మికులు వారి కుటుంబ సభ్యులు నివసిస్తున్నారని తెలిపారు. అందుకు అనుగుణంగా తిరుపతిలో సుమారు 50 శాతం టీటీడీ ఆస్తులు ఉన్నాయని, ఈ నేపథ్యంలో టీటీడీ బడ్జెట్ తిరుపతి అభివృద్ధికి కేటాయిస్తే తప్పేమిటని ప్రశ్నించారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించే శక్తులను బహిరంగంగా అడ్డుకుంటామని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు గంపల వెంకట రమణారెడ్డి, గోల్కొండ వెంకటేశం, ఆంజనేయులు, జాటోత్ భాస్కర్, ప్రసాదరావు, కట్టమంచి ఇందిర, సామిరెడ్డి కల్పన, రేణు దీక్షిత్, డాక్టర్ కుసుమ తెలిపారు. టీటీడీ ఉద్యోగులకు ఇంటి స్థలాల కలను నిజం చేసిన గొప్ప వ్యక్తి భూమన కరుణాకరరెడ్డి అని కొనియాడారు. టీటీడీ చైర్మన్ కరుణాకరరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులందరికీ ఎప్పుడూ అండగా ఉంటానని స్పష్టం చేశారు. తిరుపతిలోని టీటీడీ ఆస్తులపై మున్సిపల్ కార్పొరేషన్ ఒక్క రూపాయి కూడా పన్ను వేయడం లేదనే విషయం అందరూ గుర్తించాలని కోరారు. టీటీడీ సంస్థలు, నివాస ప్రాంతాలకు మున్సిపల్ కార్పొరేషన్ ఉచితంగా నీటి సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. తిరుపతి అభివృద్ధి, భక్తుల సదుపాయాల విషయాల్లో టీటీడీ, మున్సిపల్ కార్పొరేషన్ పరస్పర సహకారంతో ముందుకు పోవాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. కేవలం కొందరు రాజకీయ స్వలాభం కోసమే, ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ నీచరాజకీయాలు చేస్తున్నారని స్పష్టం చేశారు.



టీటీడీ చైర్మన్‌ను సత్కరిస్తున్న టీటీడీ ఉద్యోగ సంఘాల నాయకులు

బ్రహ్మోత్సవాల్లో 14 రాష్ట్రాల కళాకారులు

తిరుమల: శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో 14 రాష్ట్రాలకు చెందిన కళాకారులు వాహనసేవల్లో ప్రదర్శనలిచ్చేందుకు ఏర్పాట్లు చేసినట్లు టీటీడీ జేఈఓ సదాభార్గవి తెలిపారు. బ్రహ్మోత్సవాల మొదటి రోజు ఆదివారం తిరుమల అన్నమయ్య భవనంలో ఆమె మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో మరింతగా భక్తులను ఆకట్టుకునేలా కళారూపాలను ఎంపిక చేశామన్నారు. కళాబృందాల ప్రదర్శన వీడియోలను ముందుగానే తెప్పించుకుని, పరిశీలించి, ఎంపిక చేసినట్టు చెప్పారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, ఒడిశా, అస్సాం, మధ్యప్రదేశ్, గుజరాత్, హర్యానా, పశ్చిమబెంగాళ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, పంజాబ్, మణిపూర్ తదితర రాష్ట్రాల నుంచి కళాబృందాలు వస్తున్నట్టు జేఈవో వెల్లడించారు. ఆయా రాష్ట్రాల సంప్రదాయ నృత్యంతో పాటు జానపద నృత్యాలు, స్థానికులైన తిరుమలలోని బాలాజి నగర్, తిరుపతికి చెందిన పలు కళాబృందాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు చెప్పారు. బ్రహ్మోత్సవాల్లో మొదటిరోజు ఆంధ్రప్రదేశ్, రెండవ రోజు కర్ణాటక, మూడవ రోజు తమిళనాడు, నాలుగోరోజు తెలంగాణ, ఐదోరోజు గరుడసేవలో అన్ని రాష్ట్రాల కళాబృందాలు, మిగతా రోజుల్లో కొన్ని రాష్ట్రాలు కలిపి కళాప్రదర్శనలు ఉంటాయని వివరించారు. టీటీడీ ఎస్వీ సంగీత, నృత్య కళాశాల విద్యార్థులు ఉదయం, రాత్రి వాహనసేవల్లో సంప్రదాయ నృత్యాన్ని ప్రదర్శిస్తారని తెలిపారు. వీరితోపాటు ఎస్వీ బాలమందిరం విద్యార్థులు కోలాటం, బర్డ్ ఆసుపత్రికి చెందిన డాక్టర్ల బృందం వేషధారణ ఉంటాయన్నారు. వాహనసేవలతోపాటు తిరుమలలోని ఆస్థానమండపం, నాదనీరాజనం, తిరుపతిలోని మహతి కళాక్షేత్రం, అన్నమాచార్య కళామందిరం, రామచంద్ర పుష్కరిణి వేదికలపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఇదలా ఉంచితే, సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో కళాప్రదర్శనలు చాలా బాగున్నాయని కర్ణాటకకు చెందిన ఉన్నతస్థాయి అధికారులు, అమెరికా నుంచి కూడా భక్తులు అభినందనలు తెలియజేశారని, ప్రస్తుత కళాప్రదర్శనలు మరింత బాగా నిర్వహించడానికి వారి అభినందనలు తమలో ఉత్సాహాన్ని నింపాయన్నారు. సమావేశంలో హిందూ ధార్మిక ప్రాజెక్టుల ప్రోగ్రాం ఆఫీసర్ రాజగోపాల్, హిందూ ధర్మప్రచార పరిషత్ కార్యదర్శి శ్రీనివాసులు, దాస సాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి ఆనందతీర్థాచార్యులు, ఏఈఓ శ్రీరాములు, అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు డాక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మ, అర్చక శిక్షణ కో–ఆర్డినేటర్ హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేఈఓ సదా భార్గవి

అలరించిన నృత్య ప్రదర్శనలు

తిరుచానూరు(చంద్రగిరి): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు అలరించాయి. తిరుపతికి చెందిన నటరాజ డ్యాన్స్ ఇన్‌స్టిట్యూట్, నాట్యగురువు పుష్ప ఆధ్వర్యంలో కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కళాకారులు తన్మయి, లోకిత, కార్తీక, జశ్విత, నిశిత, జాహ్నవి, భవిష్య, జానవి, షర్మిల తమ నృత్య ప్రదర్శనలతో మంత్రముగ్ధుల్ని చేశారు. అనంతరం కళాకారులను ఏఓ ఖాదర్‌వల్లీ సత్కరించి, జ్ఞాపకలను అందజేశారు. రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం



పట్టుబడిన దుంగలు, వాహనంతో అధికారులు

తిరుపతి మంగళం : శేషాచలం నుంచి అక్రమంగా తరలిపోతున్న ఎర్రచందనం దుంగలను, వాహనాన్ని అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అటవీక్షేత్రాధికారి లోకేష్ కథనం మేరకు, ఆదివారం కరకంబాడి నుంచి మామండూరు మార్గంలోని ఆంజనేయపురం చెక్‌పోస్ట్ వద్ద విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. బాలపల్లి నుంచి ఆంజనేయపురం చెక్‌పోస్ట్ వద్దకు రాగానే కొంత మంది ఈచర్ లారీని వదిలిపెట్టి పారిపోయారు. ఆ లారీని చెక్ చేయగా అందులో 36 ఎర్ర చందనం దుంగలు ఉన్నాయని చెప్పారు. వెంటనే లారీతో సహా 36 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వాహనంతో సహా ఎర్రచందనం విలువ సుమారు రూ.కోటి ఉంటుందని చెప్పారు. ఈ తనిఖీల్లో ఎఫ్ఎస్‌వో రవీంద్ర, ఎఫ్‌బీవోలు లక్ష్మీదేవమ్మ, వెంకటేశ్వరరావు, కె.అరవింద్, పి.సురేష్‌బాబు, చెక్‌పోస్ట్ వాచర్ ప్రసాద్ పాల్గొన్నారు.

జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక

తిరుపతి ఎడ్యుకేషన్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఆదివారం తుమ్మలగుంట క్రీడా మైదానంలో ఎస్‌జీఎఫ్ అండర్–19 ఉమ్మడి చిత్తూరు జిల్లా బాలబాలికల జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. కబడ్డీ కోచ్‌లు చైతన్య, అమ్ములు, నీలిమ, సాయిసుమతి, డిల్లీ, సుధాకర్ నేతృత్వంలో సాగిన ఈ పోటీల్లో సత్తా చాటిన వారిని ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టు తరపున పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఎస్.జయరామయ్య తెలిపారు. పీడీలు సురేంద్రారెడ్డి, స్వాతి, రామచంద్ర, శైలజ, హరిణి పాల్గొన్నారు. కోచ్ రాజు ఆధ్వర్యంలో టెన్నిస్ పోటీలను నిర్వహించి ప్రతిభ చూపిన బాలబాలికలను జిల్లా జట్లకు ఎంపిక చేశారు.

కబడ్డీ బాలికల జట్టు : తులసి, కావేరి, ఐశ్వర్య, పావని, సంజన, ఉష, చారుమతి, యామిని, సుజిత, సుప్రియ, సౌందర్య, వైసుప్రియ, భువనేశ్వరి, తేజ, భవ్యశ్రీ, వాసవి, మునివేణి

కబడ్డీ బాలుర జట్టు : హర్షవర్ధన్‌రెడ్డి, అనిల్, భార్గవ్‌కుమార్, జ్ఞానేంద్రరెడ్డి, వెంకటతేజ, లక్ష్మీనరసింహ, ధనుష్, మిథున్, సునీల్, దేవేష్, శ్రావణ్‌కుమార్, తిరుమలేష్, కుమార్, నరసింహులు



కబడ్డీ జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో పీడీలు

కోలాహలం.. జెండా మహోత్సవం

గూడూరురూరల్ : పట్టణంలో మహాలయ అమావాస్య సందర్భంగా ఆంజనేయస్వామి జెండా మహోత్సవం కోలాహలంగా సాగింది. పట్టణంలోని తూర్పువీధి, కరణాలవీధి, అలఘునాథ స్వామి వీధి, మిట్టపాళెం, విఘ్నేశ్వరపురం, కోనేటిమిట్ట, ఐసీఎస్ రోడ్డు, బొగ్గులదిబ్బ, గమళ్లపాళెం, నలజా లమ్మవీధి, షాదీ మంజిల్ వీధి, అరుంధతీయపాళెం, సనత్‌నగర్, హైస్కూల్‌రోడ్డు, శివాలయం వీధి, అంబేడ్కర్‌నగర్, అశోక్‌నగర్, మాయాబజార్‌తో పాటు రెండో పట్టణ పరిధిలోని నరసింగరావుపేట, మహాలక్ష్మమ్మవీధి, మాళవ్యానగర్, జానకిరాంపేట, వీరారెడ్డిపల్లి, ఇందిరానగర్ ప్రాంతాల్లో సుమారు 70 నుంచి 100 వరకు జెండాలను ఊరేగించారు.

ఆకట్టుకున్న వేషధారణలు... బేతాళ నృత్యాలు

ఆంజనేయస్వామి జెండా మహోత్సవంలో ప్రధానంగా విచిత్ర వేషధారణలు, బొట్టబొమ్మలు, బేతాళ, అఘోరాల నృత్యాలు, కీలుగుర్రాలు, కేరళ వాయిద్యాలు, తెనాలి బ్యాండ్, తీన్‌మార్, గిరిజన నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. తూర్పువీధిలో ఏర్పాటు చేసిన గజేంద్ర మోక్షం సెట్టింగ్ అందరినీ అలరించింది. ట్రాక్టర్‌పై ఏనుగు ప్రదర్శన, భారీ హనుమాన్ వేషధారణ, ఎన్.టి.ఆర్, జూనియర్ బాలకృష్ణ, నాగార్జున, చిరంజీవి, వెంకటేష్, జూనియర్ ఎన్.టి.ఆర్. వేషధారణలో జూనియర్ ఆర్టిస్టులు ప్రదర్శనలు ఇచ్చారు.

ఉర్రూతలూగిన ఉత్సాహం


జెండా మహోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన డీజే సౌండ్స్ వద్ద ఉత్సాహంతో యువత ఉర్రూతలూగింది. చిన్న, పెద్ద తేడా లేకుండా డీజే స్టెప్‌లు వేశారు. ఎక్కడ చూసిన యువత కేరింతల నడుమ పట్టణం హోరెత్తింది. వివిధ కళాశాలలకు చెందిన యువతీ, యువకులు డీజేల వద్ద నృత్యాలు చేశారు.

తరలి వచ్చిన జనం

ఈ ఉత్సవాలకు పలు ప్రాంతాల నుంచి ప్రజలు సుమారు 80 వేల నుంచి లక్ష వరకు తరలివచ్చారని నిర్వాహకులు తెలిపారు. శనివారం రాత్రి గూడూరు పురవీధులు భక్తజనం సందోహంతో కిక్కిరిసిపోయాయి. అయితే ఏటా జెండా ఉత్సవం సందర్భంగా పలు ప్రాంతాల్లో గొడవలు జరిగేవి. ఈ ఏడాది డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో సుమారు 350 మంది సిబ్బందితో పకడ్బందీగా ప్రశాంత వాతావరణంలో జెండా మహోత్సవాలు నిర్వహించారు.



సందడి చేసిన అఘోరాలు



శివాలయం వీధి ఆంజనేయస్వామి జెండా



తూర్పువీధిలో పోటెత్తిన భక్త జనం